క్లుప్తంగా

జిల్లాస్థాయి పోటీలకు విద్యార్థిని ఎంపిక



లేఖన

నర్సంపేట రూరల్ : దాశరథి కృష్ణమాచార్య శత జయంతి వేడుకల సందర్భంగా జిల్లాస్థాయి పద్య పఠన పోటీలకు నర్సంపేట మండలం మహేశ్వరం జెడ్పీ హైస్కూల్ విద్యార్థి ఇజ్జగిరి లేఖన ఎంపికైంది. మండల స్థాయి పోటీలో లేఖన ప్రతిభ చాటి జిల్లాస్థాయి పోటీలకు అర్హత సాధించింది. లేఖనను హెచ్ఎం స్వరూప, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు అభినందించారు.

రేషన్ కార్డుల పంపిణీ



రాయపర్తి : మండలంలోని రాయపర్తి, తిర్మలాయపల్లి, గన్నారం, జగన్నాథపల్లి, తదితర గ్రామాల్లో లబ్ధిదారులకు ఆర్ఐ చంద్ర మోహన్, సిబ్బంది సోమవారం నూతన రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ శ్రీనివాస్ మాట్లాడారు. ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన కార్డులను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

పారిశుద్ధ్య పనులు



నర్సంపేట : పట్టణంలో సోమవారం మధ్యాహ్నం కురిసిన భారీ వర్షానికి పదో వార్డు పరిధిలోని మున్సిపల్ కార్యాలయం పక్క గల్లీలోని ఇళ్లలోకి వరద నీరు చేరగా మున్సిపల్ సిబ్బంది పారిశుద్ధ్య పనులు చేపట్టారు. వరద నీటితో ఇళ్లు మునిగే అవకాశం ఉండడంతో కాంగ్రెస్ పార్టీ పట్టణ కార్యదర్శి, డివిజన్ ఇన్‌చార్జ్ మోటం రవికుమార్ సమస్యను మున్సిపల్ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టారు. మున్సిపల్ జవాన్ బోడ మొగిలి సిబ్బందితో కలిసి జేసీబీతో కందకం తీయించి ఇళ్లలోకి నీరు చేరకుండా చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది అలువాల రాజు, మహేందర్, కాంగ్రెస్ నాయకులు మనగాని వెంకన్న, కొత్తగట్టు ప్రశాంత్, కొత్తగట్టు కుమార్, కుక్కల సారంగం, వేణు తదితరులు పాల్గొన్నారు.

గోరింటాకు ఉత్సవం



నర్సంపేట : నర్సంపేటలోని ఎస్ఆర్ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో సోమవారం ఘనంగా గోరింటాకు ఉత్సవం నిర్వహించారు. ప్రిన్సిపాల్ కొయ్యడి శిరీష, డైరెక్టర్ సరళ, మహిళా లెక్చరర్లు, విద్యార్థినులు అరచేతుల్లో గోరింటాకుతో సందడి చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ శిరీష, డైరెక్టర్ సరళ మాట్లాడారు. గోరింటాకు ప్రాశస్త్యాన్ని వివరించారు. ఏటా ఆషాఢ మాసంలో స్త్రీలు గోరింటాకు పెట్టుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు.

బీఆర్ఎస్ కమిటీ ఎన్నిక

నర్సంపేట రూరల్ : బీఆర్ఎస్ యువజన విభాగం నర్సంపేట మండల కమిటీని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి సోమవారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు నామాల సత్యనారాయణ కమిటీని ప్రకటించారు. అధ్యక్షుడిగా గన్ను రాజేశ్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్‌లుగా హరీశ్, పెండ్యాల స్వామి, ప్రధాన కార్యదర్శిగా సంగెం శ్రీకాంత్, అధికార ప్రతినిధులు బూస శ్రీశైలం, ధరావత్ మహేందర్, ఉపాధ్యక్షులుగా బాషబోయిన ప్రవీణ్, కద్దూరి హరీశ్, కొంగర మురళి, అల్లె రాజు, గజ్జి రాము, సహాయ కార్యదర్శులుగా జినుకల అఖిల్, పుట్ట అఖిల్, బయ్య నవీన్, చెరిపెల్లి రాజు, కోశాధికారిగా అజ్మీర నరేశ్, కార్యవర్గ సభ్యులుగా చిలుక నరేందర్, ధరావత్ రాజు, వాంకుడోతు అక్షయ్‌కుమార్, మోటం హరీశ్, నూనావత్ పవన్‌కుమార్, భూక్య సుమన్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి నర్సింహారాములు, క్లస్టర్ ఇన్‌చార్జ్ మోటూరి రవి, నాయకులు బొల్లం బక్కయ్య, గడ్డం రాజు, బగ్గి రాజు, తదితరులు పాల్గొన్నారు.

వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రాము...

ఖానాపురం : బీఆర్ఎస్ యువజన విభాగం మండల వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కొత్తూరుకు చెందిన కోరె రాము ఎన్నికయ్యారు. ఈ మేరకు రాముకు మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఎన్నిక పత్రం అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్‌ఓత్తిని శ్రీనివాస్ గౌడ్, నాయకులు సుధాకర్, శ్రీధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పల్లెల్లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తం

- ప్రబలుతున్న విషజ్వరాలు

ఖానాపురం : మండలంలోని పలు గ్రామాల్లో పారిశుద్ధ్యం అస్తవ్యస్తంగా మారింది. కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు జనావాసాల్లో వరద నీరు నిలిచి ఉండగా సైడ్ కాల్వల్లో చెత్తాచెదారం పేరుకుపోయి మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తున్న దుస్థితి నెలకొంది. ఇప్పటికే మండల పరిధిలో మూడు డెంగీ, ఒక మలేరియా కేసు నమోదైనట్లు రికార్డులు చెబుతుండగా ప్రజలు విషజ్వరాలతో బెంబేలెత్తుతున్నారు.

మండలంలో 21 గ్రామ పంచాయతీలున్నాయి. వర్షాకాలం మొదలైన క్రమంలో అన్ని గ్రామాల్లోనూ వర్షపు నీరు జనావాసాల్లో నిలిచి దర్శనమిస్తుండగా సైడ్‌కాల్వలు చెత్తాచెదారం పేరుకుపోయి మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తున్న పరిస్థితి చోటు చేసుకుంది. పర్శతండాలో జనావాసాల్లో భారీగా నీరు నిలవగా నాజీతండాలో సైడ్‌కాల్వల్లో చెత్తాచెదారం పేరుకుపోయి మురుగునీరు రోడ్లపైకి చేరింది. అధికారుల పర్యవేక్షణ కొరవడి పలు గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ నామమాత్రంగా కొనసాగుతోందని ప్రజలు బహిరంగంగానే విమర్శిస్తున్నారు.

డెంగీ, మలేరియా కేసులు నమోదు

ఇప్పటికే మండల పరిధిలో మూడు డెంగీ, ఒక మలేరియా కేసు నమోదైనట్లు రికార్డులు చెబుతున్నాయి. ఖానాపురం, బుధరావుపేట, ధర్మరావుపేట గ్రామాల్లో డెంగీ, మంగళవారిపేటలో మలేరియా కేసు నమోదైంది. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలను అప్రమత్తం చేయాల్సిన వైద్య శాఖ అధికారులు బాధ్యతను విస్మరించారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జ్వరాలు ప్రబలినప్పుడు మాత్రమే వైద్యశిబిరాలు నిర్వహిస్తూ తదనంతరం ముఖం చాటేస్తున్నారంటూ ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.



పర్శతండాలో ఇళ్ల మధ్య నిలిచిన నీరు



నాజీతండాలో సైడ్‌కాల్వల్లో మురుగునీరు

నీటినిల్వలు తొలగించాలి



వర్షాకాలం కారణంగా గ్రామాల్లో ఇండ్ల మధ్య, సైడ్‌కాల్వల్లో మురుగునీరు నిలిచింది. ప్రజలు జ్వరాలతో సతమతమవుతున్నారు. తక్షణమే మురుగు, నీటినిల్వలు తొలగించాలి. వైద్యశిబిరాలు ఏర్పాటు చేయడంతోపాటు ప్రజలకు అవగాహన కల్పించి విషజ్వరాల బారి నుంచి కాపాడాలి.

\- బంధారపు శ్రీనివాస్, గ్రామస్తుడు, రంగాపురం

వ్యాధులు ప్రబలకుండా చర్యలు



గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్య పనులు చేయిస్తాం. నీటి నిల్వలున్న చోట కాల్వలు తీయిస్తాం. సైడ్ కాల్వల్లో, గుంతల్లో నీరు నిలవకుండా చర్యలు చేపడతాం. దోమల నివారణకు క్లోరినేషన్ చేయిస్తాం. సైడ్ డ్రైనేజీల్లో వెంటనే బ్లీచింగ్ పౌడర్ చల్లిస్తాం.

\- అంబటి సునీల్‌కుమార్, ఎంపీడీఓ

స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిపించండి

- బీఆర్ఎస్ యూత్ కన్వీనర్ రాజ్‌కుమార్

దుగ్గొండి/నర్సంపేట రూరల్ : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని ఆ పార్టీ నర్సంపేట నియోజకవర్గ యూత్ కన్వీనర్ శానబోయిన రాజ్‌కుమార్, నర్సంపేట మండల ప్రధాన కార్యదర్శి ఈర్ల నర్సింహరాములు కోరారు. ఆయా మండలాల్లో నిర్వహించిన సన్నాహక సమావేశాలకు వారు హాజరై మాట్లాడారు. దుగ్గొండి మండలంలోని వెంకటాపురంలో అధ్యక్షతన సోమవారం నిర్వహించిన సన్నాహక సభకు రాజ్‌కుమార్ హాజరై మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలోనే ప్రజలకు సుపరిపాలన అందిందని చెప్పారు. వ్యవసాయ రంగానికి ప్రపంచ చరిత్రలో ప్రత్యేక గుర్తింపు లభించిందని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అన్ని వర్గాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపిస్తే ప్రజలకు అండగా నిలుస్తారని తెలిపారు. సమావేశాల్లో సొసైటీ చైర్మన్ ఊరటి మహిపాల్‌రెడ్డి, కందిపల్లి శంకర్, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు తాళ్లపెల్లి రాంప్రసాద్, భూక్య వీరన్న, జాటోతు రవి, నాయకులు నాంపల్లి సుధాకర్, ఊరటి రవి, తాళ్లపల్లి వీరస్వామి, ధరావత్ రాజు, జయపాల్‌రెడ్డి, కక్కెర్ల సాంబయ్య, గోర్కటి రాజ్‌కుమార్, భానోతు రవి, నాయకులు జైకిసాన్, బాపూరావు, కిరణ్, వీరన్న, తదితరులు పాల్గొన్నారు.



నర్సంపేట రూరల్ : సన్నాహక సమావేశంలో మాట్లాడుతున్న నర్సింహరాములు

ఘనంగా బోనాలు



దుగ్గొండి : మండల కేంద్రంలోని ఆదర్శవాణి విద్యాలయంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు సోమవారం ఘనంగా ఆషాఢం బోనాలు నిర్వహించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు బోనాలతో ర్యాలీగా రాగా కొందరు విద్యార్థులు పోతురాజుల వేషధారణతో నృత్యాలు చేశారు. అమ్మవారికి బోనం సమర్పించారు. కార్యక్రమంలో విద్యాసంస్థల చైర్మన్ నాగనబోయిన రవి, బత్తిని భిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ బలోపేతమే లక్ష్యంగా తండాబాట

- జిల్లా నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి

రాయపర్తి : బీఆర్ఎస్ బలోపేతమే లక్ష్యంగా మండలంలో తండాబాట కార్యక్రమం చేపట్టినట్లు జిల్లా నాయకుడు, ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. మండలంలోని బంధనపల్లి, దుబ్బతండా గ్రామాల్లో సోమవారం నిర్వహించిన గడపగడపకు బీఆర్ఎస్, పల్లెబాట కార్యక్రమాల్లో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలోనే ప్రజలకు సంక్షేమ పథకాలు అమలయ్యాయని చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ బలపర్చిన అభ్యర్థులను గెలిపించాలని కోరారు. తొలుత పలువురికి ఆర్థికసాయం అందించారు. యువతకు క్రికెట్ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో పార్టీ మండల అధ్యక్షుడు మూనావత్ నర్సింహానాయక్, మాజీ ఎంపీపీ జినుగు అనిమిరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి పూస మధు, ఎస్టీ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సురేందర్ రాథోడ్, నాయకులు ఎలమంచ శ్రీనివాస్‌రెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, బిల్లా వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

గురుకుల పాఠశాలలో పాము కలకలం

పర్వతగిరి : మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో సోమవారం పాము కలకలం సృష్టించింది. ఐదో తరగతి విద్యార్థులు పాఠశాల ఆవరణలోని గడ్డిని తొలగిస్తుండగా పాము కనిపించడంతో విద్యార్థులు బెంబేలెత్తారు. ఐదో తరగతి విద్యార్థిని శివానీ తనను పాము కరిచిందని భావించి తీవ్ర భయాందోళనకు గురైంది. దీంతో ప్రిన్సిపాల్ అపర్ణ, ఉపాధ్యాయులు శివానీని వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ అపర్ణ మీడియాతో మాట్లాడారు. శివానీ భయపడిందని, ఆమెను పాము కాటు వేయలేదని, ఆస్పత్రిలో అబ్జర్వేషన్ అనంతరం ఇంటికి పంపించామని చెప్పారు.

ఉచిత వైద్యశిబిరం



రాయపర్తి : మండలంలోని సన్నూరులో బాల వికాస సేవా సంస్థ అనుబంధ జనవికాస ఆధ్వర్యంలో తొర్రూరుకు చెందిన లక్ష్మీనర్సింహ ఆస్పత్రి నిర్వాహకులు సోమవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ గైనకాలజిస్ట్ తేజస్విని మహిళలకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అనంతరం జనవికాస మెయిన్ కోఆర్డినేటర్ మద్దెల రమ మాట్లాడారు. మహిళలు వైద్యశిబిరాన్ని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నలమాస సారయ్య, మాజీ ఉపసర్పంచ్ కొమురుమల్లు, బొంద్యాలు, ఆస్పత్రి పీఆర్ఓ సుభాష్, సిబ్బంది కృష్ణవేణి, ప్రవంతి, రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాధికారమే సమస్యలకు పరిష్కారం



దీక్ష సందర్భంగా అభివాదం తెలుపుతున్న నాయకులు

- సమితి ప్రధాన కార్యదర్శి కుమారస్వామి

నల్లబెల్లి : దళిత బహుజనులు తరతరాలుగా ఎదుర్కొంటున్న సమస్యలకు రాజ్యాధికారమే పరిష్కారమని బీసీ హక్కుల సాధన సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకింది కుమారస్వామి తెలిపారు. ఎన్నికల హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ దళిత మేధా శక్తి సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో సోమవారం చేపట్టిన దీక్షను కుమారస్వామి ప్రారంభించి మాట్లాడారు. అగ్రకుల పార్టీలు దళిత, గిరిజన, బీసీలకు హామీలు గుప్పించి ఓట్లు దండుకుని తర్వాత విస్మరించడం రివాజుగా మారిందని మండిపడ్డారు. చెవెళ్ల డిక్లరేషన్ మేరకు ఎస్సీలకు 18 శాతం రిజర్వేషన్, అంబేడ్కర్ అభయహస్తం కింద రూ.12 లక్షల ఆర్థిక సాయం, ఇందిరమ్మ ఇండ్లు, అసైన్డ్ భూముల పునరుద్ధరణ, ఎస్సీలకు అటవీ హక్కుల చట్టాన్ని వర్తింప చేయాలని కోరారు. దీక్షలో కూర్చున్న వారికి బీజేపీ మండల అధ్యక్షుడు తడుక వినయ్ నిమ్మరసం అందించి విరమింపజేశారు. దీక్షలో దళిత మేధా శక్తి సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు బొట్ల పవన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రొట్టె సురేశ్, ప్రచార కమిటీ అధ్యక్షుడు అడ్డ రాజు, కోశాధికారి సంపత్, సహాయ కార్యదర్శి నత్తి శ్యామ్, తదితరులు పాల్గొనగా బీసీ హక్కుల సాధన సమితి నాయకులు చెట్టుపల్లి దామోదర్, వైనాల వీరస్వామి, మామిండ్ల మోహన్‌రెడ్డి, కొనుకటి వీరమల్లు, బీజేపీ నాయకులు బొద్దిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, పర్వతాలు సంఘీభావం తెలిపారు.

దేవాదుల ప్రాజెక్టు నీటిని విడుదల చేయాలి

వర్ధన్నపేట : రైతులు సకాలంలో వరి నాట్లు వేసుకునే విధంగా దేవాదుల ప్రాజెక్టు నీటిని విడుదల చేయాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కుందూరు మహేందర్‌రెడ్డి ఒక ప్రకటనలో కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం, స్థానిక ఎమ్మెల్యే రైతులను పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. జిల్లాలో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం కోసం వినతిపత్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యేలకు రైతుల పరిస్థితి కనిపించడం లేదా అని ప్రశ్నించారు. తమ జేబులు నింపుకునే ప్రాజెక్టుల కోసం ఎమ్మెల్యేలు తహతహ లాడుతున్నారని తెలిపారు. వెంటనే స్థానిక ఎమ్మెల్యే రైతుల గోడును సీఎం దృష్టికి తీసుకువెళ్లి త్వరితగతిన దేవాదుల ప్రాజెక్టు ద్వారా నీటిని అందించాలని కోరారు. లేకుంటే దీక్షలు తప్పవన్నారు.

రేపు 'చలో సెక్రటేరియట్'

నర్సంపేట : విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం రేపు (ఈనెల 23న) చలో సెక్రటేరియట్ కార్యక్రమం నిర్వహిస్తామని యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మొగిలిచర్ల సందీప్ తెలిపారు. పట్టణంలో సోమవారం నిర్వహించిన సంఘం ముఖ్యకార్యకర్తల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. విద్యారంగ సమస్యలను ప్రభుత్వాలు విస్మరిస్తున్నాయని తెలిపారు. గత బీఆర్ఎస్ విద్యార్థి వ్యతిరేక విధానాలు అవలంబించి అధికారాన్ని కోల్పోయిందని చెప్పారు. స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయడంతోపాటు విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయిస్తామని, ఇతర అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ ప్రభుత్వం సైతం నిర్లక్ష్యం చేస్తోందన్నారు. పాఠశాలలు తెరుచుకుని రెండు నెలలు గడుస్తున్నా మౌలిక సదుపాయాలు కల్పించడం లేదన్నారు. సమస్యల పరిష్కారానికి సెక్రటేరియట్‌ను ముట్టడిస్తామన్నారు. సమావేశంలో నాయకులు వెంకటేశ్, అరుణ్, రమేశ్, రవి, విశాల్, తదితరులు పాల్గొన్నారు.

నివాళి

పర్వతగిరి : మండలంలోని చింతనెక్కొండ శివారులోని ఎస్‌జీతండాకు చెందిన బీఆర్ఎస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు అనవత్ రవి తల్లి తారమ్మ సోమవారం మృతి చెందగా ఆమె మృతదేహానికి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ మనోజ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎర్రబెల్లి రాజేశ్వర్‌రావు, మాజీ సర్పంచ్ గటిక మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

బోజెరువులో..

నర్సంపేట : చెన్నారావుపేట మండలంలో బోజెరువు గ్రామానికి చెందిన అబ్రపురి నారాయణ, జీడిగడ్డతండాకు చెందిన గుగులోతు అచ్చిరామ్ కుమారుడు లోకేశ్ మృతి చెందగా వారి మృతదేహాలకు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సిద్దన రమేశ్ నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబాలను పరామర్శించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి మొగిలి వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కేతిడి వీరారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మంద యాకయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

నెక్కొండ : మండల కేంద్రానికి చెందిన ఫొటోగ్రాఫర్ తాటిపాముల వెంకటేశ్వర్లుకు అతడి కుమారుడు విష్ణువర్ధన్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన క్రమంలో ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ మండల కమిటీ ఆధ్వర్యంలో రూ.20 వేల సాయం అందించారు. తొలుత విష్ణువర్ధన్ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఏకాంబ్రం, కార్యదర్శి దేవేందర్, కోశాధికారి వినోద్, గౌరవ సభ్యులు రఘువీర్, సూర్యనారాయణ, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటాలి



సమావేశంలో మాట్లాడుతున్న హరీశ్‌రెడ్డి

- మార్కెట్ కమిటీ చైర్మన్ హరీశ్‌రెడ్డి

నెక్కొండ : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ బలపర్చిన అభ్యర్థులను గెలిపించి సత్తా చాటాలని స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీశ్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బక్కి అశోక్ కోరారు. మండలంలోని బొల్లికొండ, అలంకానిపేట, వెంకటాపురం గ్రామాల్లో సోమవారం నిర్వహించిన ఎన్నికల సన్నాహక సమావేశాల్లో వారు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని శ్రేణులకు సూచించారు. పంచాయతీ, పరిషత్ ఎన్నికల్లో పార్టీ జెండా ఎగరేయాలని ఆకాంక్షించారు. సమావేశాల్లో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి కుసుమ చెన్నకేశవులు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్లు లావుడ్య తిరుమల్, ఆవుల శ్రీనివాస్, రెడ్లవాడ పీఏసీఎస్ వైస్ చైర్మన్ రాజనాల సంపత్, నాయకులు బండి శివకుమార్, బానోతు శ్రీధర్, రాంపెల్లి శ్రావణ్, మాదాసు రామ్మూర్తి, మాచర్ల శేషగిరి, ఎడ్ల సురేందర్, బానోతు యాకూబ్, గోపీ, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు

- కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సత్యం

వర్ధన్నపేట : కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తుందని ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఎద్దు సత్యం తెలిపారు. మండలంలోని ఇల్లందలో పలువురి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను సోమవారం ఆయన కొబ్బరికాయలు కొట్టి ముగ్గుపోశారు. ఈ సందర్భంగా స్థానిక నాయకుడు పోశాల వెంకన్నతో కలిసి సత్యం మాట్లాడారు. పేదలందరికీ ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయనుందని చెప్పారు. ఎమ్మెల్యే నాగరాజు సహకారంతో పేదలందరికీ దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు మంజూరవుతాయని తెలిపారు. నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే కృషి చేస్తున్నారని చెప్పారు. నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ స్కూల్, సబ్ కోర్టు మంజూరు చేయించారని చెప్పారు. కార్యక్రమంలో ఐనవోలు ఆలయ డైరెక్టర్ గుంటి కుమారస్వామి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు సమ్మయ్య, ఏలియా, చైర్మన్ బుచ్చిమల్లు తదితరులు పాల్గొన్నారు.



భూమి పూజ చేస్తున్న నాయకులు, లబ్ధిదారులు

రేవూరిపై విమర్శలు అర్థరహితం



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

- కాంగ్రెస్ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి

గీసుకొండ : పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిపై మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి చేస్తున్న విమర్శలు అర్థరహితమని కాంగ్రెస్ పార్టీ జిల్లా, పరకాల నియోజకవర్గ అధికార ప్రతినిధులు రావుల శ్రీనివాస్‌రెడ్డి, చాడ కొమురారెడ్డి అన్నారు. మండలంలోని కోనాయమాకులలో సంగెం, గీసుకొండ మండలాల ముఖ్యనాయకులతో సోమవారం నిర్వహించిన సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు తుమ్మనపెల్లి శ్రీనివాస్‌తో కలిసి శ్రీనివాస్‌రెడ్డి, కొమురారెడ్డి మాట్లాడారు. ఎమ్మెల్యేగా ప్రకాశ్‌రెడ్డి నిత్యం ప్రజల్లో ఉంటూ సమస్యల పరిష్కారానికి పాటుపడుతున్నారని చెప్పారు. బీఆర్ఎస్ హయాంలో ఎమ్మెల్యేగా ధర్మారెడ్డి ప్రజలను విస్మరించడంతోనే ప్రజలు ఆయన్ను ఓడించారని ధ్వజమెత్తారు. నాటి అక్రమాలను ధర్మారెడ్డి మర్చిపోయినట్లు ప్రస్తుత ఎమ్మెల్యేపై అసత్య ప్రచారాలు చేస్తున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్‌కు, ఎమ్మెల్యేకు వస్తున్న ప్రజాదరణ ఓర్వలేకే ధర్మారెడ్డి, బీఆర్ఎస్ నాయకులు దుష్ప్రచారానికి తెగబడుతున్నారని తెలిపారు. సమావేశంలో మాజీ ఎంపీపీ బీమగాని సౌజన్య, పార్టీ సంగెం మండల అధ్యక్షుడు చొల్లేటి మాధవరెడ్డి, నాయకులు మెట్టుపల్లి రమేశ్, విలాసాగరం వెంకటేశ్వర్లు, కొమ్ము శ్రీకాంత్, జగన్నాథచారి, రాంబాబు, రమేశ్, రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై అసత్య ప్రచారాలు మానుకోవాలి

- కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సత్యనారాయణ

వర్ధన్నపేట : స్థానిక ఎమ్మెల్యే కేఆర్.నాగరాజుపై అసత్య ప్రచారాలు మానుకోవాలని బీఆర్ఎస్ నాయకులకు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ హితవు పలికారు. పట్టణంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గడచిన 20 నెలల్లో దేవాదుల నీటితో మండలంలో చెరువులు, కుంటలను నింపలేదన్న ప్రకటనపై క్షేత్రస్థాయి నిరూపణకు తాము సిద్ధంగా ఉన్నామన్నారు. దమ్ముంటే బీఆర్ఎస్ నాయకులు చర్చకు రావాలని సవాల్ విసిరారు. మాజీ మంత్రి దయాకర్‌రావు కుటిల రాజకీయాలు సాగవన్నారు. బీఆర్ఎస్ నాయకుల దుష్ప్రచారాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. సమావేశంలో కాంగ్రెస్ జిల్లా నాయకుడు పోశాల వెంకన్న, యువజన కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు యాకాంతం, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సత్యనారాయణ

కాంగ్రెస్‌కు రాజీనామా.. బీజేపీలో చేరిక



పార్టీలో చేరిన వారికి కండువా కప్పుతున్న రాణాప్రతాప్‌రెడ్డి

నల్లబెల్లి : కాంగ్రెస్ రంగాపురం గ్రామ కమిటీ అధ్యక్షుడు ముల్క రాజేశ్‌తో సహా పలువురు ఆ పార్టీకి రాజీనామా చేసి బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా మండలంలోని రంగాపురంలో బీజేపీ మండల అధ్యక్షుడు తడుక వినయ్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో పార్టీలో చేరిన వారికి బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోగుల రాణాప్రతాప్‌రెడ్డి కండువాలు కప్పి ఆహ్వానించి మాట్లాడారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ యువతకు ప్రాధాన్యత ఇస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని విస్మరించిందని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వ నిధులతోనే పల్లెల్లో అభివృద్ధి పనులు చేపడుతున్నారని చెప్పారు. సమావేశంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి గడ్డం అంజనేయులు, పార్లమెంటరీ నియోజకవర్గ కమిటీ కోకన్వీనర్ కట్ల రాంచంద్రరెడ్డి, జిల్లా కౌన్సిల్ మెంబర్ బొద్దిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

పర్వతగిరి : మండలంలోని కొంకపాకకు చెందిన అల్లాడి కొమ్మాలు, సంగరబోయిన రవీందర్, వసంత, పస్తం ప్రభాకర్ ఇటీవల వేర్వేరు ఘటనల్లో మృతి చెందగా బాధిత కుటుంబాలను వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు సోమవారం పరామర్శించారు. బాధిత కుటుంబాలను వారి నివాసాల్లో కలిసి పరామర్శించారు. తొలుత మృతుల చిత్రపటాలకు నివాళులర్పించారు.

బాధిత కుటుంబాలకు..

నర్సంపేట : పద్మశాలి సంఘం పట్టణ గౌరవ అధ్యక్షుడు బాల్నె సర్వేశం సతీమణి చంద్రకళ గతేడాది, పట్టణానికి చెందిన బంగారమ్మ ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాలను మాజీ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి పరామర్శించారు. మృతుల కుటుంబాలను పరామర్శించారు. కార్యక్రమాల్లో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సత్యనారాయణ, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.